క్లుప్తంగా

నేటి నుంచి మర్రి పోలేరమ్మ ఉత్సవాలు



మర్రి పోలేరమ్మ దేవాలయం

మెళియాపుట్టి: మండల కేంద్రంలో గ్రామ దేవత మర్రి పోలేరమ్మ ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా గ్రామంలోని ఉజ్జిడమ్మ తల్లి, బండార్లమ్మ తల్లి, మరిడమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి, ఇంజాద్రమ్మ గ్రామ దేవతలకు ముర్రాటలతో చల్లదనం చేస్తామని గ్రామ పెద్దలు యువత తెలిపారు.

టీటీడీలో శ్రీలత నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న శ్రీలత

ఆమదాలవలస: దేశంలోనే ప్రముఖ పుణ్య క్షేత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానంలో పట్టణానికి చెందిన నాట్యశ్రీ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకురాలు కూన శ్రీలత శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. నాద నీరాజనం కార్యక్రమంలో భాగంగా కూచిపూడి విశ్వవిద్యాలయం నాట్యాచార్యులు డా.చింతాడ రవిబాలకృష్ణ సారథ్యంలో శ్రీలత కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. దీంతో పట్టణానికి చెందిన పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

చెరువులను పరిశీలించిన అధికారులు



రాతికర్ర చెరువును పరిశీలిస్తున్న అధికారులు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. దీంతో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ దృష్టికి హైదరాబాద్‌కు చెందిన గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ తీసుకెళ్లింది. దీంతో పట్టణంలోని జలగల, రాతికర్ర చెరువులను శనివారం ఆర్డీవో సాయి ప్రత్యూష, సర్వే డిపార్టమెంట్ ఏడీ కె.రమేష్, ఆర్డీవో కార్యాలయం డీఐవోఎస్ వెంకటేశ్వరరావుల బృందం పరిశీలించింది. ఆక్రమణదారుల జాబితా తయారు చేయాలని కింది స్థాయి అధికారులకు ఆదేశించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ సూచనల మేరకు నివేదిక తయారు చేస్తున్నామని తెలిపారు. వారితో పాటు తహసీల్దార్ టి.సత్యనారాయణ, మండల సర్వేయర్ అప్పలస్వామి, ఈవో ద్రాక్షయిణి తదితరులు పాల్గొన్నారు.

సరుకుల వ్యాన్ బోల్తా



రోడ్డుపై బోల్తాపడిన వ్యాన్

సారవకోట: గార మండలం శ్రీకూర్మం నుంచి పర్లాకిమిడికి కిరాణా సరుకులతో వెళ్తున్న వ్యాన్ శనివారం సారవకోట మండలం అలుదు గ్రామ సమీపంలో బోల్తా పడింది. టైర్ పేలిపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వ్యాన్‌ను పక్కకు తీశారు. ఎస్‌ఐ అనిల్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



శంకుస్థాపన చేస్తున్న తమ్మినేని గీత

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని పలు వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. పురపాలక సంఘంలోని 13వ వార్డు విద్యానగర్‌లో సుమారు రూ.9 లక్షల నిధులతో రహదారి, కాలువ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, నాయకులు కూన ఆంజనేయులు, మున్సిపల్ అధికారి పీవీవీకే రాజు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భయం.. భయం



శిథిలావస్థకు చేరుకున్న పర్లాం కూడలి వద్దనున్న వంతెన

- శిథిలావస్థలో చోడవరం వద్ద వంతెన
- ఏ క్షణంలో కూలుతుందోనని ఆందోళన
- విరిగిన రక్షణ గోడ



అధ్వానంగా ఉన్న వంతెన

నరసన్నపేట: మండలంలోని చోడవరం ముందు పర్లాం రోడ్డు కూడలిలో పోలాకి ఓపెన్ హెడ్ ఛానల్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో ఏ క్షణంలో కూలుతుందోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉకలాం–కొమనాపల్లి ఆర్అండ్‌బీ రోడ్డును విస్తరించి అభివృద్ధి చేస్తున్నా.. వంతెన మాత్రం పునర్నిర్మించలేదు. సుమారు 40 ఏళ్ల క్రితం ఈ వంతెన నిర్మించారు. అప్పుడప్పుడు మరమ్మతులు చేసినా ప్రస్తుతం పూర్తిగా శిథిలమయ్యింది. వర్షాకాలం వచ్చిందంటే వంతెన కూలుతుందేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గత సీజన్‌తో పోల్చితే ప్రస్తుతం మరింతగా వంతెన శిథిలమయ్యింది.

పెచ్చులూడిపడుతున్నాయ్..

వంతెన కింద భాగంలో పెచ్చులు ఊడిపడుతున్నాయి. అలాగే వంతెనకు రెండు వైపులా ఉన్న రక్షణ గోడ విరిగిపోయింది. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. అలాగే ఈ వంతెన సింగిల్ రోడ్డు ఉన్నప్పుడు నిర్మించింది కావడంతో ఒక వాహనం మాత్రమే వెళ్లేందుకు వీలు అవుతుంది. కాగా నియోజకవర్గంలో ఈ రోడ్డు ఎంతో ప్రాధాన్యత కలిగినది. కోమర్తి జంక్షన్ నుంచి కొమనాపల్లి మీదుగా పుణ్యక్షేత్రం శ్రీముఖలింగానికి ఈవైపు నుంచే వెళ్తుంటారు. అలాగే నరసన్నపేట, జలుమూరు మండలాలకు కలిపే ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వంతెన కూలితే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉంది. అందువలన అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వంతెన పునర్నిర్మాణం చేపట్టి వెడల్పు చేయాలని విన్నవిస్తున్నారు.

ప్రమాదకరంగా ఉంది



ఇది పురాతన వంతెన కావడంతో ప్రస్తుతం బాగా శిథిలమయ్యింది. ఈ విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. దీంతో ఏ రోజు కూలుతుందోననే ఆందోళన మా గ్రామాల్లో ఉంది. అలాగే వంతెనకు రెండువైపులా ఉన్న రక్షణ గోడలు కూడా విరిగిపడ్డాయి. వాటినీ నిర్మించడం లేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

– అంపోలు సుధ, చోడవరం

చర్యలు తీసుకుంటాం



ఈ వంతెన శిథిలావస్థకు చేరడం నిజమే. ఇప్పటికే పలుమార్లు పరిశీలించడం జరిగింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వంతెన పునర్నిర్మించేందుకు ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. అనుమతులు రావాల్సి ఉంది. మరోసారి వంతెన కండిషన్ పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం.

– ఎ.శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఏఈ

షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపిక



కొమరాపు మేఘన



గురాడి భానుజ

పాతపట్నం: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డులను అందజేసింది. దీంట్లో పాతపట్నం విజ్ఞాన్ స్కూల్‌కు చెందిన కొరరాపు మేఘన మోహన్, గురాడి భానుజలు ఎంపికైనట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ డి.గంగధర్ శనివారం తెలియజేశారు. ఈ అవార్డు కింద ప్రభుత్వం నుంచి రూ.20 వేల నగదు, మెడల్, ప్రశంసా పత్రాలను ఈనెల 9వ తేదీన కలెక్టర్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

హిరమండలం: మండలంలోని పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన ఆరుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈవో కె.రాంబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు టంకాల షర్మిల పూజిత, అందవరపు భరత్‌లు, గులుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జి.జయంతికుమార్, జస్వీన్ పి.నిఖిల్, తంప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బి.దిలీప్‌లను జిల్లా విద్యాశాఖ ఎంపిక చేసినట్లు ఎంఈవో తెలిపారు. దీంతో విద్యార్థులు ఉపాధ్యాయులు అభినందించారు.

కొత్తూరు: ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కొత్తూరు మండలం నుంచి అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులను షైనింగ్ స్టార్స్‌గా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఎంపిక చేసిన విద్యార్థుల బ్యాంకు ఖాతాతో పాటు పలు వివరాలు విద్యాశాఖ ద్వారా ప్రభుత్వం పంపించమని ఆదేశించినట్లు ఎంఈవో గోవిందరావు చెప్పారు. మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బర్రి హరిణి, రాజ్ శ్రీనివాస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ నుంచి పప్పు మోక్షిశ్రీ, కొండగొర్రి ఫణేంద్రలు, మహర్షి విద్యాలయం నుంచి టొంపల లౌచిత, నబూరి సాహిత, సునీన విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాల నుంచి పాలో అరుణ కుమార్‌లు ఎంపికైనట్లు వెల్లడించారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

బూర్జ: వ్యవసాయంలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని భారత వ్యవసాయ పరిశోధన మండలి వాణిజ్య పంటల పరిశోధన స్థానం రాజమండ్రి శాస్త్రవేత్త శైలజ జైశేఖర్ అన్నారు. మండలంలోని కాశపర్తి రైతు సేవా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరిలో వచ్చే చీడపీడల సమగ్ర సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు వివరించారు. అలాగే వరి పరిశోధన స్థానం నుంచి కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ మట్టి పరీక్షలు చేయడం వలన ఎరువుల యాజమాన్యం ఏవిధంగా చేపట్టవచ్చో తెలుస్తుందన్నారు. అపరాలు, మామిడి, జీడి తోటలను ఆశించే చీడపీడలు మరియు వాటి యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. కలుపు నివారణ యాజమాన్య పద్ధతులు తెలియజేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.అనూష, ఏవో ఎన్.శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ బి.వరహాలునాయుడు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సాగుకు సమాయత్తం



కృష్ణాపురం వద్ద దుక్కులు చేస్తున్న దృశ్యం



జంబాడ వద్ద పొలంగట్లు బాగు చేస్తున్న రైతులు

- నేడు మృగశిర కార్తె ప్రవేశం
- రైతుకు అందని అన్నదాత సుఖీభవ

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. వేసవిలో రైతులు పొలాలను దుక్కిచేసి ఖరీఫ్ విత్తనాలు వేసుకునేందుకు సిద్ధం చేశారు. ఏప్రిల్ నుంచి వర్షాలు అనుకూలంగానే కురుస్తున్నాయి. మరోవైపు ఆదివారం నుంచి మృగశిర కార్తె ప్రవేశిస్తుంది. మృగశిర కార్తెలో విత్తనాలు వేసుకుంటే పంటలు బాగా పండుతాయని రైతున్నల నమ్మకం. దీంతో విత్తనాలు వేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే ప్రభుత్వం ఇస్తామన్న పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ఇస్తామని ఊరిస్తుందే తప్ప నిధులు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ కావడం లేదు. దీంతో పంట పెట్టుబడులకు అప్పులు కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతు భరోసా సకాలంలో అందేదని గుర్తు చేసుకుంటున్నారు.

గతంలో వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ లబ్ధిదారులు

మండలం	లబ్ధిదారులు	నిధులు (రూ.కోట్లలో..)
కొత్తూరు	10,694	7.99
మెళియాపుట్టి	9,669	7.25
పాతపట్నం	9,213	6.19
ఎల్.ఎన్.పేట	5,766	4.32
హిరమండలం	5,523	4.14

అన్నదాత సుఖీభవ ఇవ్వాలి



వైఎస్సార్‌సీపీ హయాంలో నా బ్యాంక్ ఖాతాకు జమ చేసిన 'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్' డబ్బులు పెట్టుబడికి సాయంగా ఉపయోగించేవాడిని. విత్తనాలు కొనేందుకు కొంత డబ్బులు ఖర్చయినా మిగిలినవి పొలం దుక్కులు, ఇతర పనులకు కూలి చెల్లించేందుకు ఇచ్చేవాడిని. ఇప్పుడు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయంగా ఇస్తామన్న అన్నదాత సుఖీభవ అందివ్వాలని కోరుతున్నాను.

– శివ్వాల షణ్ముఖరావు, పూశాం, ఎల్.ఎన్.పేట

జాబితాలు సిద్ధం



రైతులకు ప్రభుత్వం ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం కోసం అర్హులైన రైతుల పేర్లతో జాబితాలు సిద్ధంగా ఉన్నాయి. ఒక్కొక్క స్థాయిలో విచారణ పూర్తి చేసి జిల్లా అధికారులకు నివేదించడం జరిగింది. మరో వారం రోజుల్లో ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందించేందుకు జాబితాలను సిద్ధం చేయాలని సూచించారు.

– పైడి లతశ్రీ, ఏవో, ఎల్.ఎన్.పేట

అభినందనలు

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామానికి చెందిన బుగత అనిల్ కుమార్ మందస ఇన్‌చార్జి ఎంఈవోగా నియమకం అయినందుకు పలువురు ఎంఈవోలు శనివారం అభినందనలు తెలిపారు. పాతపట్నం, హిరమండలం, కొరసవాడ మండల ఎంఈవోలు సీహెచ్ తిరుమలరావు, కె.రాంబాబు, ఎం.వెంకటరమణలుతో పాటు ప్రధానోపాధ్యాయులు ఎస్.కుమారస్వామి, బి.సింహాచలం, ఆర్.వల్లభరావు, సీహెచ్ విశ్వనాథం, రాజగోపాల్, ఎం.రామారావులు అనిల్ కుమార్‌కు అభినందనలు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

హిరమండలం: వస్తువుల క్రయ, విక్రయాల్లో నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ ఎండీ యాసిన్ సూచించారు. హిరమండలంలో శనివారం పలు షాపులను జాగిలాలతో తనిఖీలు చేశారు. ముఖ్యంగా నిషేధిత వస్తువుల అమ్మకాలు విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలు జరపకూడదన్నారు. అటువంటివి చేస్తే షాపుల లైసెన్సులు సైతం రద్దు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పాతపట్నం: మెళియాపుట్టి మండలం చీపురుపల్లి (పెద్దమడి) ఆర్అండ్ఆర్ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్వాసితులు కోరుతున్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావును కలిసి వినతిపత్రం అందజేశారు. నిర్వాసిత గ్రామాల్లో డ్రైనేజీ, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

శివాలయానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులతో సూర్యనారాయణ

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–2 ఆర్ఆర్ కాలనీలో నిర్మించిన శివాలయానికి బిట్–1 ఆర్ఆర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు రూ.25 వేలు విరాళం శనివారం అందజేశారు. అలాగే ఒండ్రుజోలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ రూ.50 వేల నగదు, 50 బస్తాల సిమెంట్‌తో పాటు అన్న ప్రసాద కార్యక్రమానికి బియ్యం అందజేశారు. విరాళ దాతలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.



విరాళం అందజేస్తున్న బూర్లె శ్రీనివాసరావు

పరామర్శ



అల్లాడ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

సరుబుజ్జిలి: మండలంలోని పాలవలస పంచాయతీ పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన విశ్రాంత వీఆర్వో అల్లాడ వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం పరామర్శించారు. ఆయనతో పాటు రావివలస, కొండవలస సర్పంచ్‌లు వండాన కృష్ణ, లావేటి విశ్వేశ్వరావు, పార్టీ నేతలు మూడడ్ల రమణ, కరణం అసిరినాయుడు, అల్లు శ్రీను, సురవరపు హరి, వెంకటరావు, లక్ష్మణరావు, సిద్దార్థ, రోహిత్ తదితరులు ఉన్నారు.

శ్రీముఖలింగంలో హోమం



హోమం, బలిహరణ నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు జ్యేష్ఠ మాసం శనివారం ఔపాసన, హోమం, బలిహరణ, హారతి మంత్రపుష్పం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. దీనికి ముందు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి క్షీరాభిషేకం నిర్వహించారు.

చినుకు పడితే చిత్తడే



సరుబుజ్జిలి మండంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు చినుకుపడితే చిత్తడిగా మారుతున్నాయి. దీనివలన వర్షాల సమయంలో రాకపోకలు చేసేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జేజే రోడ్డు నుంచి బుడ్డివలస గ్రామానికి వెళ్లే రహదారి అసంపూర్తిగా ఉండిపోవడం వలన వర్షాల సమయంలో ప్రజలు నరకయాతన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

విస్తృతంగా తనిఖీలు



కొత్తూరు మండలంలో సిరుసువాడ గ్రామంలోని పలు దుకాణాల్లో శనివారం డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలు గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు ఏఎస్‌ఐ గోవిందరావు తెలిపారు. నార్కోటిక్స్ ప్రత్యేక శిక్షణ పొందిన డాగ్‌స్క్వాడ్‌తో ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక సీఐ చింతాడ ప్రసాదరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు.

– కొత్తూరు

త్యాగాలకు ప్రతీక బక్రీద్



పాతపట్నం: ప్రహరాజపాలేం మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నరసన్నపేట: సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నరసన్నపేట: స్థానిక జామియా మసీదు ఆవరణలో ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని శనివారం జరుపుకున్నారు. మత గురువు ఆరాఫత్ ముస్లింలకు బక్రీద్ ప్రాధాన్యతను వివరించారు. త్యాగాలకు ప్రతీక బక్రీద్ అన్నారు. త్యాగం వెనుక ప్రేమ, ప్రేమ వెనుక దైవం ఉంటుందని తెలియజేశారు. అనంతరం సామూహిక ప్రార్థనలు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ బాబ్జీ, ముస్లిం సంఘ ప్రతినిధులు ఎండీ మదీన్, ఎండీ అజ్జా, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలేంలో బక్రీద్ వేడుకలు శనివారం నిర్వహించారు. మసీదులో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. అనంతరం బంధు మిత్రులకు ఖీర్‌ను పంచుకున్నారు. కార్యక్రమంలో మసీద్ గురువు మహ్మద్ లుక్‌మాన్, పారశెల్లి రామరాజు, షేక్ షాంద్, ఫరీద్, ఫకీర్, హీబ్రహిం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

కొత్తూరు: ఉపాధ్యాయుల బదిలీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. ఈ మేరకు స్థానిక విద్యాశాఖ కార్యాలయం ముందు ఉపాధ్యాయుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. వెబ్ ఆప్షన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు శాంతారావు, డి.ప్రకాశరావు, గణపతి, మధుసూదనరావు, జీవీ రమణ పాల్గొన్నారు.

రెండు కిలోల వెండి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

కొత్తూరు: స్థానిక వేంకటేశ్వర స్వామివారి ఆలయంలోని స్వామివారి మకర తోరణం తయారు చేయడానికి కొత్తూరుకు చెందిన కొమనాపల్లి గోపాలదాసు నాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారులు ప్రసాద రావునాయుడు, ప్రభాకరరావు నాయుడు, రవి నాయుడు, రత్నాకరరావు నాయుడులు రెండు కిలోల వెండిని శనివారం ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లోతుగెడ్డ తాతబాబు, గుడ్ల కృష్ణారావు, పెదకోట యతిరాజు, పొగిరి రవి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

సరుబుజ్జిలి: రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకుంటే అధిక దిగుబడులు సాధ్యపడతాయని రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ మధుకుమార్ తెలిపారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆమదాలవలస కృషి విజ్ఞానం కేంద్రం, వ్యవసాయ శాఖ అనుబంధంగా కొండ్రగూడ గ్రామంలో వ్యవసాయ ప్రణాళికా సదస్సు శనివారం నిర్వహించారు. శాస్త్రవేత్త కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం గురించి వివరించారు. లింగాకర్షక బుట్టల ప్రాధాన్యంపై శాస్త్రవేత్త శైలజ వివరించారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పెరటి కోళ్లు, పుట్ట గొడుగులు, చేపల పెంపకం చేయడం వలన అదనపు ఆదాయం సాధించవచ్చునని శాస్త్రవేత్త చింతాడ బాలకృష్ణ తెలిపారు. సమావేశంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతులందరికీ విత్తనాలు సరఫరా

ఎల్.ఎన్.పేట: రైతులందరికీ విత్తనాలు సరఫరా చేయాలని ఎల్.ఎన్.పేట జెడ్పీటీసీ కిలారి త్రినాథులు అధికారులకు సూచించారు. మండలంలోని యంబరాం, బొత్తాడసింగి, కరకవలస, మిరియాపల్లి, చొర్లంగి, కొమ్మువలస తదితర గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద శనివారం విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిచారు. కార్యక్రమంలో సర్పంచ్ వెలమల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.